క్లుప్తంగా

వీరేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు


జి.అగ్రహారంలో వీరేశ్వరస్వామి

అంబాజీపేట: గంగలకుర్రు అగ్రహారంలో వేంచేసిన ఉమా పార్వతీ సమేత వీరేశ్వరస్వామి వారి ఆలయంలో మాసశివరాత్రి, ఆరుద్ర నక్షత్రం సందర్భంగా బుధవారం ఘనంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు చంద్రమౌళి సూర్యకామేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేపట్టారు. అనంతరం స్వామివారిని విశేషంగా అలంకరించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సచివాలయ సిబ్బందికి వీడ్కోలు సత్కారం

కొత్తపేట: మోడేకుర్రు సచివాలయం పరిధిలో పనిచేసి ఇతర ప్రాంతాలకు బదిలీ అయిన కార్యదర్శి రాజేశ్వరి, ఇతర విభాగాల సిబ్బందికి బుధవారం ఘనంగా వీడ్కోలు సన్మానం చేశారు. పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కుడిపూడి రామలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడుతూ 2019–2025 వరకు గ్రామ అభివృద్ధికి తమ అంకితభావంతో పనిచేసిన సిబ్బందికి అభినందనలు తెలియజేస్తూ, వారిచే అందించిన సేవల పట్ల కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రెడ్డి శ్రీనివాస్, వీడీసీ కన్వీనర్ కె.వెంకటేశ్వరరావు, రంబాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీ, పీఎంపీల జిల్లా నూతన కార్యవర్గం ఎంపిక


నూతన కార్యవర్గ సభ్యులు

అంబాజీపేట: కోనసీమ జిల్లా ఆర్ఎంపీ, పీఎంపీల అధ్యక్షుడిగా కె.బాబూరావును ఏకగ్రీవకంగా ఎన్నుకున్నారు. మాచవరం మెట్లకాలనీలో ఉన్న షాదీఖానా భవనంలో జిల్లా ఆర్ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం బుధవారం జరిగింది. నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా గౌరవ అధ్యక్షుడిగా ఎస్.లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శిగా ఎండీ రఫీ, కోశాధికారిగా డి.వెంకటేశ్వరరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ నూతన కమిటీ మూడేళ్ల పాటు పదవిలో కొనసాగుతుందన్నారు. సమావేశంలో 16 మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, కోనసీమ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు.

లైన్‌మన్ మృతి


బిళ్ల ఆనందరావు (ఫైల్)

మామిడికుదురు: విధి నిర్వహణలో అస్వస్థతకు గురై అప్పనపల్లి గ్రామానికి చెందిన లైన్‌మన్ బిళ్ల ఆనందరావు (46) బుధవారం మృతి చెందారు. ఆదివారం రాత్రి అప్పనపల్లిలో కరెంటు సరఫరా నిలిచిపోవడంతో దాన్ని పునరుద్ధరించేందుకు వెళ్లి పాశర్లపూడి ఏటిగట్టు ప్రాంతంలో పడిపోయాడన్నారు. అతన్ని సహచర లైన్‌మన్ అమలాపురం ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని తెలిపారు. ఇతను గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడని స్థానికులు తెలిపారు. అతని కుటుంబ సభ్యులను ఏపీఈపీడీసీఎల్ ఉద్యోగులు పరామర్శించారు.

నిత్యాన్నదానానికి రూ.10 వేల విరాళం


దాతకు స్వామి చిత్రపటం అందజేస్తున్న అర్చకుడు

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వర స్వామి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి ఐరగవరం మండలం రేలంగి గ్రామానికి చెందిన వలుపు అనిల్ కుమార్, లావణ్య దంపతులు రూ.10 వేలు బుధవారం అందజేశారు. దాతఈ సొమ్మును ఆలయ ప్రధానార్చకుడు మాచరి వినాయకరావుకు అందజేశారు. దాతను వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. దాతను ఆలయ సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

బీమా సొమ్ము అందజేత

పి.గన్నవరం: కె.ఏనుగుపల్లి గ్రామానికి చెందిన సానబోయిన సత్యవతి ఇటీవల పాముకాటుతో మృతి చెందగా పీఎం జీవనజ్యోతి బీమా యోజన పథకం కింద ఆమె భర్త అర్జునరావుకు బుధవారం రూ.2 లక్షల భీమా సొమ్మును పి.గన్నవరంలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తోలేటి బంగారు నాయుడు, పి.గన్నవరం యూనియన్ బ్యాంకు మేనేజర్ కోట ఆశోక్ కోబ్రగడే, ఆర్డీఓ బీవీ సుభాష్, ఎన్.శేఖర్, నరేష్‌బాబు, బీసీపీ బద్దే శ్రీనివాస్, తోలేటి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా వంతెనలు

- దెబ్బతిన్న రెయిలింగ్‌లు
- చర్యలు తీసుకోవాలని డిమాండ్


పాశర్లపూడిలంక వంతెనపై విరిగిపోయిన రెయిలింగ్‌లు


నగరం వానరాశివారి మెరకలో ప్రమాదకరంగా వంతెన

మామిడికుదురు: వంతెనలకు రెండు వైపులా ఏర్పాటు చేసిన రెయిలింగ్ దెబ్బతినడంతో ప్రమాదకర పరిస్థితుల్లో ప్రయాణం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. చాలాకాలం క్రితమే వంతెన రెయిలింగ్ పాడైపోయిన వాటిని పట్టించుకోవడం లేదన్న ఆందోళన ప్రజల నుంచి వ్యక్తమవుతోంది. మామిడికుదురు మండలంలోని పలు గ్రామాల్లో ఈ పరిస్థితి ఉంది. ప్రమాదకరంగా మారిన వంతెనలకు రెండు వైపులా రెయిలింగ్స్ నిర్మాణం కోసం చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ వ్యక్తమవుతోంది.

వాడబోది మీడియం డ్రైన్‌పై పరిస్థితి ఇదీ..

పాశర్లపూడిలంకలోని వాడబోది మీడియం డ్రైన్‌పై నిర్మించిన వంతెనకు రెండువైపులా రక్షణ కోసం ఏర్పాటు చేసిన రెయిలింగ్ దెబ్బతిన్నాయి. ఇక్కడ డ్రైన్ లోతుగా ఉంటుంది. ఎవరైనా పట్టుతప్పితే ఇంతే సంగతులు. వంతెన ఎత్తుగా ఉండడంతో వంతెన పై నుంచి పడితే తీవ్రంగా గాయపడే పరిస్థితి ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. సంబంధిత అధికారులు దీనిపై స్పందించాల్సి ఉంది.

ఈ రెయిలింగ్స్ పునరుద్ధరణకు పెద్దగా ఖర్చు కూడా ఉండదని చెబుతున్నారు. వాడ్రేవుపల్లి మీడియం డ్రైన్‌పై నగరం గ్రామంలోని వానరాశివారి మెరకలో వాడ్రేవుపల్లి మీడియం డ్రైన్‌పై నిర్మించిన వంతెన ఇరువైపులా ఏర్పాటు చేసిన రెయిలింగ్స్ కూడా విరిగిపోయాయి. వీటిని కూడా పునరుద్ధరించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

వంతెన రెయిలింగ్ నిర్మించండి



పాశర్లపూడిలంక గ్రామంలోని డ్రైన్‌పై నిర్మించిన వంతెన రెయిలింగ్స్ పాడైపోయాయి. రెండు వైపులా రెయిలింగ్స్ దెబ్బతినడంతో భయం భయంగా ప్రయాణం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనిపై అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించాల్సి ఉంది. దెబ్బతిన్న వంతెన రక్షణ కవచాలను పునర్నిర్మించాల్సి ఉంది. ఆ దిశగా చర్యలు తీసుకోవాలి. ఏ విధమైన ప్రమాదకం జరగక ముందే మేల్కోవాలి.

– బాలం రమేష్, పాశర్లపూడిలంక

రక్షణ చర్యలు చేపట్టండి



వంతెనలు ప్రమాదకరంగా మారాయి. వెంటనే రక్షణ చర్యలు చేపట్టాలి. వాడ్రేవుపల్లి మీడియం డ్రైన్‌పై నిర్మించిన వంతెనపై వెళ్లాలంటే భయపడే పరిస్థితి ఉంది. ప్రధానంగా పిల్లల విషయంలో భయమేస్తోంది. వంతెన చాలా ఎత్తులో ఉంది. ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారు. దీనిపై వెంటనే అధికారులు స్పందించాలి. వంతెనకు రెండు వైపులా రక్షణ చర్యలు చేపట్టాలి. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి.

– వానరాశి బుజ్జి, నగరం

కోకో మొక్కలను రైతులతో నాటించాలి


అంబాజీపేటలో క్షేత్రస్థాయి పరిశీలన చేస్తున్న ఏపీడీ రాంబాబు

అంబాజీపేట: ప్రభుత్వం నుంచి మంజూరైన కోకో మొక్కలను సంబంధిత రైతులతో త్వరితగతిన నాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఉపాధి పథకం ఏపీడీ డి.రాంబాబు అన్నారు. అంబాజీపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం ఏపీఓ ఎ.వెంకటకృష్ణ అధ్యక్షతన క్షేత్రస్థాయి సహాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఏపీడీ రాంబాబు మాట్లాడుతూ ఉపాధిహామీ పథకాన్ని ఉద్యాన పంటల సాగుకు వర్తింప చేసిన నేపథ్యంలో ప్రభుత్వం మండలంలోని 44 లబ్ధిదారులకు 74.25 ఎకరాల్లో 12,172 కోకో మొక్కలను ఉచితంగా మంజూరు చేసిందన్నారు. ఎకరాకు 2 వందల మొక్కల వంతున రూ.81.26 లక్షలను ప్రభుత్వం ఉచితంగా రైతులకు అందజేసిందన్నారు. ఒక్కో రైతు మూడేళ్లలో రూ.1.59 లక్షల వంతున లబ్ధి పొందుతారని రాంబాబు వివరించారు. మొక్కల సంరక్షణలో భాగంగా క్షేత్ర స్థాయిలో, సహాయకులు లబ్ధిదారులకు తగు సలహా సూచనలు ఇచ్చి ప్రభుత్వం సూచించిన విధంగా గోతులు తీసి వాటిని కంపోస్టు ఎరువుతో నింపాలన్నారు. సమావేశంలో ప్లాంటేషన్ మేనేజర్ ఎం.త్రినాథ్, జెఈ పి.వెంకటేశ్వరరావు, టెక్నికల్ అసిస్టెంట్, క్షేత్రస్థాయి సహాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీల ఎంపిక


సఖినేటిపల్లిలంకలో నూతన గ్రామ శాఖ కమిటీ సభ్యులతో నాయకులు

సఖినేటిపల్లి: వైఎస్సార్ సీపీ రాజోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గొల్లపల్లి సూర్యారావు ఆదేశాలతో మండల పార్టీ అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో గ్రామ స్థాయిలలో పార్టీ నూతన కమిటీల ఎంపిక చురుగ్గా సాగుతోంది. బుధవారం అప్పనరామునిలంకలో గ్రామ శాఖ నూతన అధ్యక్షుడిగా నల్లి మధు, ప్రధాన కార్యదర్శిగా మిరియాల రాంబాబును ఎన్నుకున్నారు. సఖినేటిపల్లిలంకలో గ్రామ శాఖ నూతన అధ్యక్షుడిగా నడింపల్లి రామచంద్రరాజు, ప్రధాన కార్యదర్శిగా ముత్యాల రామారావును ఎన్నుకున్నారు. పార్టీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ రుద్రరాజు చిన రాజా, విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రతినిధి తాడి సహదేవ్, జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు దొంగ ఏసు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఈద రవిరెడ్డి, లీగల్ సెల్ అధ్యక్షుడు దివ్వి చిట్టిబాబు, నాయకులు చల్లా నాగరాజు, ఎల్లమెల్లి కిషోర్, వేగ్నేసిన సతీష్, నడింపల్లి సుబ్బరాజు పాల్గొన్నారు.

మండల స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయండి


ఆలమూరులో నిర్వహించిన వైఎస్సార్ సీపీ సమావేశంలో పాల్గొన్న పార్టీ ప్రతినిధులు

ఆలమూరు: ఆలమూరులోని శ్రీవినాయక కన్వెన్షన్‌లో ఈనెల 26న నిర్వహించబోయే వైఎస్సార్ సీపీ మండల స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు పిలుపునిచ్చారు. స్థానిక కన్వెన్షన్ హాలులో గ్రామ కమిటీ అధ్యక్షుడు రావాడ సత్తిబాబు అధ్యక్షతన బుధవారం నిర్వహించిన సమావేశానికి ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆదేశాల మేరకు ఈనెల 26న నిర్వహించనున్న పార్టీ సమావేశానికి అన్ని గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు. గ్రామ కమిటీ అధ్యక్షులను ఎన్నుకోవడంతో పాటు రాష్ట్రర, జిల్లా స్థాయిలో పార్టీ పదవులు పొందిన నాయకులను ఘనంగా సత్కరించనున్నట్లు మండల కన్వీనర్ తమ్మన తెలిపారు. అలాగే ఏడాదిగా అధికార కూటమి పార్టీ పాలన పరంగా విఫలమైన తీరును ప్రజలకు వివరించేందుకు పార్టీ శ్రేణులందరూ సమాయత్తం కావాలని విజ్ఞప్తి చేశారు. పార్టీ నాయకులు యనమదల నాగేశ్వరరావు, నామాల శ్రీనివాసు, నాంద్ర నాగమోహన్ రెడ్డి, నాతి కుమార్‌రాజా, గుణ్ణం రాంబాబు, కోలా నాని, నాయుడు ప్రసాద్, చామకూరి శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

వినూత్నంగా డీసీసీబీ మొండి బకాయిల వసూళ్లు

రాజోలు: జిల్లా సెంట్రల్ కోఆపరేటివ్ బ్యాంక్ రుణాల మొండి బకాయిలను వినూత్న రీతిలో వసూళ్లు చేస్తున్నారు. బుధవారం చింతలపల్లి, పోతుమట్ల గ్రామాల్లో చింతలపల్లి పీఏసీఎస్ సొసైటీ పరిధిలోని రాజోలు డీసీసీబీ బ్యాంకు సిబ్బంది రుణ వసూళ్లకు శ్రీకారం చుట్టారు. తీసుకున్న రుణాలు చెల్లించకుండా తప్పించుకుని తిరుగుతున్న బకాయిదారులను గుర్తించి వారి ఇంటికి వెళ్లి ×సకాలంలో రుణాలు చెల్లించండి–సహకార రంగాన్ని పటిష్ట పరచండి¥ అని ముద్రించిన ఫ్లెక్సీతో ఇంటి అరుగుపై కూర్చుని బకాయిలు చెల్లించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. నాన్ పేమెంట్ అకౌంట్‌లు పెరిగిపోకుండా ఆర్‌బీఐ నిబంధనలకు లోబడి మొండి బకాయిలు వసూలు చేస్తున్నామన్నారు. డీసీసీబీ బ్యాంక్ ఏజీఎం యెలిశెట్టి రమేష్, బీఎం స్టీఫెన్‌పాల్, సూపర్‌వైజర్ ప్రవల్లిక, చింతలపల్లి పీఏసీఎస్ సీఈఓ కేవీఎస్ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

సాక్షి ఇంపాక్ట్


సంధిపూడిలో ఏర్పాటు చేస్తున్న మినీ ట్రాన్స్‌ఫార్మర్

ఆలమూరు: మండలంలోని సంధిపూడిలో ఇటీవల దెబ్బతిన్న రెండు ట్రాన్స్‌ఫార్మర్లను ట్రాన్స్‌కో అధికారులు వినియోగంలోకి తీసుకువచ్చారు. ఈనెల 20న 'సాక్షి' దిన పత్రికలో 'ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు చేపట్టాలి' అనే శీర్షికతో కథనం ప్రచురితమైన విషయం పాఠకులకు విదితమే. దీనిపై మండపేట ఏడీఈ సీహెచ్ శ్రీధర్, ఆలమూరు ఏఈ డీఎంకె దుర్గాప్రసాద్ స్పందించారు. ట్రాన్స్‌కో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు లైన్ ఇన్‌స్పెక్టర్ వి.సత్యనారాయణ నేతృత్వంలో విద్యుత్ సిబ్బంది గ్రామానికి వచ్చి పరిస్థితిని సమీక్షించారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం పక్కన ఉన్న 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేపట్టి పునరుద్ధరించారు. అలాగే వేణుగోపాలస్వామి ఆలయం పక్కన గత మూడేళ్ల నుంచి చెడిపోయిన ఉన్న 6.3 ఉవీ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుతో రాత్రివేళల్లో ఎటువంటి ఆటంకాలు లేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా జరుగుతుందని లైన్‌మన్ బషీర్ తెలిపారు.

రాష్ట్రంలో కూటమి రాక్షస పాలన

- ప్రభుత్వంపై కోఆర్డినేటర్ గన్నవరపు విమర్శ
- పలు గ్రామాల్లో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ


కుందాలపల్లిలో జరిగిన రచ్చబండలో పాల్గొన్న కోఆర్డినేటర్ శ్రీనివాసరావు

పి.గన్నవరం: అబద్ధాలతో గద్దెనెక్కిన ముఖ్యమంత్రి చంద్రబాబు కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో రాక్షసపాలన సాగిస్తున్నారని పి.గన్నవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కుందాలపల్లి, నరేంద్రపురం, రాజులపాలెం, పోతవరం గ్రామాల్లో మండల పార్టీ అధ్యక్షుడు యన్నాబత్తుల ఆనంద్, గ్రామ శాఖల అధ్యక్షులు చిన్నం నాగరాజు, గుత్తుల త్రిమూర్తులు, నక్కా గోపి, మోకా సత్యనారాయణల పర్యవేక్షణలో బుధవారం బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి ప్రజలను కలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాలను ఏ విధంగా ఎగ్గొట్టిందో వివరించారు. రచ్చబండ కార్యక్రమాల్లో గన్నవరపు మాట్లాడుతూ చంద్రబాబు ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారని, దీంతో రాష్ట్రంలో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అబద్ధాలతో గద్దెనెక్కిన చంద్రబాబుకు తగిన బుద్ధి చెప్పాలని అన్నారు. మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి, సీనియర్ నాయకుడు మందపాటి కిరణ్‌కుమార్‌లు మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రతి సంక్షేమ పథకాన్ని ప్రజలకు డోర్ డెలివరీ చేశారని గుర్తు చేశారు. జగన్‌ను మళ్లీ సీఎంగా గెలిపించాలని అన్నారు. సర్పంచ్‌లు కొంబత్తుల ఏసుబాబు, వడలి కొండయ్య, ఎంపీటీసీ పులపర్తి రాజారావు, పార్టీ నాయకులు మెల్లం మహాలక్ష్మీ ప్రసాద్, జల్లి పండు, దొమ్మేటి వెంకట శివరామన్, పితాని నర్సింహారావు, దొమ్మేటి దుర్గారావు, జి.మధు, సత్యనారాయణ, దాసు, మద్దుల వరలక్ష్మి పాల్గొన్నారు.

దళిత యువకుడిపై దాడి అమానుషం


మహేశ్వరరావును పరామర్శిస్తున్న మానవ హక్కుల వేదిక నాయకులు

అయినవిల్లి: తమ రాజకీయ కుల దురహంకారంతోనే మండలంలోని వెలువలపల్లికి చెందిన దళిత యువకుడు దోనిపాటి మహేశ్వరరావుపై దాడి జరిగినట్లు మానవహక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యేడిద రాజేష్ తెలిపారు. ఈ విషయమై మానవ హక్కుల వేదిక రాష్ట్ర, జిల్లా బాధ్యులు బుధవారం మహేశ్వరరావుతో మాట్లాడి నిజనిర్ధారణ చేశారు. ఈ సంఘటనకు సంబంధించిన విషయాలపై వారు పత్రికా ప్రకటన విడుదల చేశారు. వారు మాట్లాడుతూ ఆర్థిక అంశాల్లో తలెత్తిన వివాదంలో నిందితులు చట్టబద్ధ విధానాలను విస్మరించి దాడులకు తెగబడటం అమానుషమని అన్నారు. ఈ విషయమై పోలీసు విచారణ రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా నిష్పక్ష పాతంగా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హెచ్ఆర్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.రవి జిల్లా అధ్యక్షుడు ఎండీ ఇక్బాల్ కార్యవర్గ సభ్యుడు పవన్ తదితరులు పాల్గొన్నారు.

హార్బర్ పరిశీలన

సఖినేటిపల్లి: మండలంలోని పల్లిపాలెం ఫిషింగ్ హార్బర్‌లో పూర్తి స్థాయిలో విద్యుత్ సరఫరా సౌకర్యం నిమిత్తం ఆ శాఖ అమలాపురం డివిజన్ స్థాయి అధికారి కృష్ణరాజా బుధవారం పరిశీలన చేశారు. ఇటీవల హార్బర్‌లో పర్యటించిన కలెక్టర్ దృష్టికి స్థానిక మత్స్యకారులు విద్యుత్ సౌకర్యం కోసం చేసిన విజ్ఞప్తి మేరకు కృష్ణ రాజా హార్బర్‌కు వచ్చారు. రాజోలు ఏఈ ప్రసాద్‌తో కలసి ఆయన తగిన చర్యలు తీసుకునే నిమిత్తం మత్స్యకారులతో కూడా చర్చించారు.

విద్యార్థులకు యూనిఫాం పంపిణీ


యూనిఫాం అందజేస్తున్న విశ్రాంత హెచ్ఎం ఆనందరావు

అయినవిల్లి: మండలంలోని నేదునూరు జెడ్పీ ఉన్నత పాఠశాల ప్లస్‌లోని మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు రిటైర్డ్ హెచ్ఎం కత్తుల ఆనందరావు బుధవారం యూనిఫాం పంపిణీ చేశారు. రెండు జతల యూనిఫాంను విద్యార్థులకు అందజేశారు. కత్తుల ఆనందరావును పాఠశాల చైర్మన్ పసుపులేటి వెంకటేశ్వరరావు, ప్రధానోపాధ్యాయుడు పీఎస్‌వీవీ ప్రసాదరావు తదితరులు అభినందించారు.

పేదరికం లేని సమాజమే లక్ష్యం


వక్కలంకలో పీ–4 గ్రామసభలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అంబాజీపేట: పేదరిక నిర్మూలన ప్రభుత్వ లక్ష్యమని ప్రతి సచివాలయ పరిధిలో బంగారు కుటుంబాలను గుర్తించే గురుతర బాధ్యత సచివాలయ సిబ్బందిపై ఉందన్నారు. వక్కలంక గ్రామంలో బుధవారం జరిగిన పీ–4 రీ వాలిడేషన్ సర్వే గ్రామ సభలో కలెక్టర్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సమాజంలోని అట్టడుగు 20 శాతం మంది పేదలను గుర్తించి వారి బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దుతూ సమాజంలో ఆర్థిక అసమానతలను రూపుమాపే యజ్ఞాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నామన్నారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ ఆర్థికంగా సమాన అవకాశాలు పొందే విధంగా పీ–4 పథకానికి ప్రభుత్వం రూపకల్పన చేసిందన్నారు. గ్రామాల్లో అత్యంత ధనికులైన 10 శాతం మంది మార్గదర్శకులు గుర్తించి బంగారు కుటుంబాలకు దత్తతనిచ్చేలా ఈ వేదికలను నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.చిన్నబాబు, సర్పంచి వాసంశెట్టి రేవతి, వాసంశెట్టి పెదబాబు, మార్గదర్శకులు బంగారు కుటుంబాల సభ్యులు, మండల, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యంతోనే ఆరోగ్యమైన పంట

అంబాజీపేట: పురుగుమందులు, రసాయన ఎరువులు ఉపయోగించకుండా నేల తన శక్తిని గరిష్టంగా వినియోగించేలా చేయడం ద్వారా ఆరోగ్యకరమైన, నాణ్యమైన పంటలను సమృద్ధిగా ఉత్పత్తి చేయడానికి ఒక ప్రకృతి సేద్య వ్యవసాయ పద్ధతితోనే సాధ్యమని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అన్నారు. వక్కలంకలో జీవామృతం, ఆవు మూత్రం, పేడతో తయారుచేసే ఘనజీవామృతాల తయారీ కేంద్రాన్ని ఏపీసీఎన్ఎఫ్ ఫ్లాట్స్‌ను కలెక్టర్ బుధవారం సందర్శించారు. స్థానికంగా జీవామృత కషాయాలను పెద్ద మొత్తంలో తయారు చేసి రైతులకు 2, 5, 10 లీటర్లు విక్రయిస్తున్న ఘన, జీవామృత కషాయ కేంద్రంలో ఉత్పత్తుల తయారీ విధానాలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, సర్పంచ్ వాసంశెట్టి రేవతి, తహసీల్దార్ బి.చినబాబు, ఇన్‌చార్జి ఎంపీడీఓ ఏపీఎల్ నరసింహారావు, ఏఓ కె.ధర్మప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భూ యజమాని సంతకం లేకుండా కార్డులు ఇవ్వాలి

మామిడికుదురు: మండలంలోని కౌలు రైతులకు భూ యజమాని సంతకం లేకుండా సాగుదారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరుతూ తహసీల్దార్ పి.సునీల్‌కుమార్‌కు బుధవారం వినతిపత్రం ఇచ్చారు. ఏపీ కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి పీతల రామచంద్రరావు, సంఘం ప్రతినిధులు తాటికాయల ఉదయభాస్కరరావు, సత్తి ధర్మారావు తదితరులు తహసీల్దార్‌ను కలసి ఈ వినతిపత్రం ఇచ్చారు. ఎరువులు, పురుగు మందులు సబ్సిడీపై ఇవ్వాలని, కౌలు రైతులందరికీ రుణాలు అందించాలని కోరారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది దాటినా కౌలు రైతులకు ఇంత వరకు ఏ సహకారం అందలేదని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించి సాగుదారులందరికీ సహాయం అందించాలని కోరారు.

సూర్యఘర్‌ను సద్వినియోగం చేసుకోండి

ఆలమూరు: కేంద్ర ప్రభుత్వం పేదలకు ఉచిత విద్యుత్‌ను అందించేందుకు వీలుగా ప్రవేశపెట్టిన సూర్యఘర్ సోలార్ సిస్టమ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఎ.రాజు పిలుపునిచ్చారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ట్రాన్స్‌కో, గ్రామ సచివాలయ సిబ్బందితో బుధవారం సమావేశం జరిగింది. ఈ సూర్యఘర్ పథకాన్ని ఎస్సీ, ఎస్టీలకు పూర్తి ఉచితంగానే అందజేస్తుందన్నారు. అలాగే ఓసీ, బీసీ కులాలకు 35 శాతం రాయితీపై అందజేస్తుందన్నారు. ఈ పథకం వల్ల ప్రతి ఇంటికి సుమారు 200 యూనిట్లు ఉత్పత్తి జరుగుతుందన్నారు. శ్లాబు కలిగిన ఎస్సీ, ఎస్టీలు అందరూ సూర్యఘర్ పథకం ద్వారా సోలార్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనంతరం స్థానిక ఏకలవ్య వీధి, ఎస్సీ ఏరియాల్లో అధికారులందరూ కరపత్రాల ద్వారా సూర్యఘర్ ఆవశ్యకతను వివరించారు. ట్రాన్స్‌కో ఏఈ డీఎంకె దుర్గాప్రసాద్, లైన్ ఇన్‌స్పెక్టర్ వి.సత్తిబాబు, లైన్‌మన్ గంటి శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవార్లకు ఆషాఢం సారె సమర్పణ


కనకమహాలక్ష్మమ్మకు సమర్పించిన సారె


ఈదరాడలో శాకంబరిగా పొల్లమ్మ


లూటుకుర్రు పెద్దింట్లమ్మకు సమర్పించిన సారె


వాకలగరువులో రావులమ్మకు..

శాకంబరిగా అలంకరణ

మామిడికుదురు/కొత్తపేట/అంబాజీపేట/పి.గన్నవరం/రాజోలు: ప్రజల్ని చల్లగా చూడాలని కోరుతూ మామిడికుదురు మండలంలోని పలు గ్రామాల్లో అమ్మవార్లను బుధవారం శాకంబరిగా అలంకరించారు. అమ్మవార్లకు ఆషాఢం సారె సమర్పించారు. ఈదరాడ, లూటుకుర్రు, పాశర్లపూడి గ్రామ దేవతలు పొల్లమ్మ, పెద్దింట్లమ్మ, పళ్లాలమ్మ, మహాలక్ష్మమ్మ, వనువులమ్మను బుధవారం శాకంబరిగా అలంకరించారు. అనంతరం భక్తులు అమ్మవార్లకు ఆషాఢం సారె సమర్పించారు. కొత్తపేటలోని స్థానిక బొరుసువారి సావరంలో వేంచేసిన విజయకనకదుర్గాదేవికి బొరుసు వెంకట ఉదయ భాస్కర్–వసుధ దంపతుల ఆధ్వర్యంలో ఆషాఢమాసం చీర, సారె సమర్పించారు.


బి.సావరం దుర్గాదేవికి తీసుకువెళుతున్న సారె

అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు, లలితా సహస్ర పారాయణ నిర్వహించి, అమ్మవారికి చీర, సారె సమర్పించారు. అంబాజీపేట మండలం వాకలగరువులో వేంచేసిన గ్రామ దేవత రావులమ్మకి భక్తులు ఆషాఢం సారె సమర్పించారు. 200 రకాల పిండి వంటలతో కూడిన సారె సమర్పించారు. పి.గన్నవరం గ్రామ దేవత తాటమ్మ వారికి పి.గన్నవరం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఆషాఢం సారె సమర్పించారు. కార్యక్రమాల్లో ఆర్య వైశ్య సంఘ అధ్యక్షుడు పాబోలు కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు. రాజోలు మండలం కడలిలో వేంచేసిన కనకమహాలక్ష్మమ్మకి బుధవారం సారె సమర్పించారు. గ్రామానికి చెందిన మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని 36 వివిధ రకాల 100 కేజీల స్వీట్లను అమ్మవారికి సమర్పించారు.

తిరునక్షత్ర ఉత్సవాలకు సన్నాహాలు

కొత్తపేట: కోనసీమ తిరుపతిగా ప్రసిద్ధి చెందిన ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివారి క్షేత్రంలో గురువారం నుంచి ఐదు రోజుల పాటు ఆండాళ్ అమ్మవారి తిరునక్షత్ర ఉత్సవాలు నిర్వహించనున్నారు. దేవదాయ – ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధర రావు ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి ఆదిత్య అనంత శ్రీనివాస్, అర్చకులు, వేద పండితుల బృందం ప్రతి రోజూ వివిధ కార్యక్రమాలు జరుపుతారు. ఇందులో భాగంగా ఉదయం ఆండాళ్ అమ్మవారి సన్నిధిలో ద్రవిడ వేద పారాయణ, సాయంత్రం ప్రాకారోత్సవం తదితర కార్యక్రమాల అనంతరం ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాల వితరణ జరుపుతారు. సంప్రదాయాలను అనుసరించి స్వామివారి సన్నిధిలో జరిగే కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని స్వామి, అమ్మవార్ల ఆశీస్సులు పొందాలని ఈఓ చక్రధరరావు కోరారు.

- ఆలయం వద్ద వకుళమాత అన్నప్రసాద భవన నిర్మాణానికి పశ్చిమగోదావరి జిల్లా తణుకు గ్రామానికి చెందిన సప్పా బాలకృష్ణ, ప్రశాంతి దంపతులు రూ.25,116 విరాళంగా అందజేశారు. వారికి ఈఓ చక్రధరరావు స్వామివారి చిత్రపటాన్ని ఇచ్చారు.